


అగ్ని ప్రమాదాలపై అవగాహన

నరసరావుపేటటౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు నరసరావుపేట అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.



బీచ్ కబడ్డీ పోటీలకు స్థల పరిశీలన

మచిలీపట్నంరూరల్: మంగినపూడిబీచ్‌లో మేలో జరగబోయే బీచ్ కబడ్డీ పోటీల నిర్వహణ పై అధికారులు, స్పోర్ట్స్ అథారిటీ బృందం గురువారం బీచ్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించింది.

న్యూస్‌రీల్

'గురుకుల' ప్రవేశానికి 19 వరకు దరఖాస్తు గడువు



రెంటచింతల:స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వివిధ తరగతులలో ఇంగ్లిష్ మీడియంలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం బాలురు ఈ నెల 19వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్ కోరారు. గురువారం పాఠశాలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖాళీలను తరగతుల వారీగా రోస్టర్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతిలో 40, 6వ తరగతిలో 10, 9వ తరగతిలో 9 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. బ్యాక్ లాగ్ సీట్లు కేవలం ఎస్టీ విద్యార్థులకు మాత్రమేనని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ నకలు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రేషన్‌కార్డు జిరాక్స్‌ను జత చేసి పాఠశాలలో అందించాలని కోరారు.

క్రీడా శిక్షణ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: భారత క్రీడా ప్రాధికార సంస్థ నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (పటియాల) ఆధ్వర్యంలో ఎంఎస్సీ స్పోర్ట్స్ కోచింగ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ స్పోర్ట్స్ కోచింగ్ (2025–27), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులు (2025–26), అకడమిక్ సెషన్ 2025–27 విద్యా సంవత్సరాలకు సంబంధించి స్పెషలైజేషన్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మే నెల 2వతేదీలోగా httpr://www.rrc.nmir.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే, శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఇచ్చినట్టు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావద్దని కోరారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సరుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. సోమవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని వివరించారు.

1,58,818 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,39,333 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,58,818 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 57,411 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

శావల్యాపురం తహసీల్దారు సస్పెన్షన్

శావల్యాపురం: విధుల్లో అలసత్వం వహించడం తోపాటు పలు ఆరోపణల నేపథ్యంలో మండల తహసీల్దార్ కె.సుజాతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో జరుగుతున్న రెవెన్యూ వ్యవహారాలపై పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో వీటిపై విచారణాధికారిగా నరసరావుపేట ఆర్డీవో కె.మధులతను ఆయన నియమించారు. ఆర్డీవో విచారణకు వచ్చిన సమయంలో కూడా తహసీల్దార్ సుజాత సమయపాలన పాటించలేదు. ఫిర్యాదుదారులు చెప్పిన అంశాలను ఆర్డీవో నమోదు చేసుకొని నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. దీంతో ఆమెను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ చేసిన విషయాన్ని ఆర్డీవో కె.మధులత ధ్రువీకరించారు. మండలం నూతన తహసీల్దారుగా అర్జున్‌నాయక్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం రెంటచింతల మండల తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్నారు.



కార్యదర్శులకు కాసుల వర్షం

- జాతీయ రహదారి నిర్మాణంతో భూముల ధరలకు రెక్కలు
- జోరుగా అక్రమ లే అవుట్లు
- గ్రామ పంచాయతీ కార్యదర్శులు భారీగా అవినీతి
- జిల్లా, డివిజన్ పంచాయతీ అధికారుల సహకారం

వేటపాలెం: జాతీయ రహదారి నిర్మాణంతో తీర ప్రాంత గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. జాతీయ రహదారికి ఇరువైపులా భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. ఏకంగా ఎకరం రూ.2 కోట్లు పైనే పలుకుతుంది. సముద్ర తీర గ్రామలైన రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం గ్రామాలలో పర్యాటకం కూడా బాగా అభివృద్ధి చెందింది. దీనితో ఆయా గ్రామాలలో ఏకంగా ఎకరం దాదాపు రూ.ఏడు కోట్లు పలుకుతుంది. దీంతో అక్రమ లే అవుట్‌లు విచ్చలవిడిగా వెలిశాయి. ఇది పంచాయతీ కార్యదర్శులకు వరంగా మారింది. లే అవుట్‌లు, భవన నిర్మాణాలకు ఫిక్స్‌డ్ ధర నిర్ణయించి వసూళ్లు ఆరంభించారు.

అనుమతి లేని లే అవుట్‌లు..

సముద్ర తీరం వెంట రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం గ్రామాల పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో లేఅవుట్‌లు వెలశాయి. వీటితోపాటు 50 వరకు రిసార్ట్‌ల నిర్మాణాలు జరిగాయి. 216 జాతీయ రహదారి ఇరువైపుల పంట పొలాలు, అసైన్డ్ భూముల్లో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్‌లు వెలిశాయి. ఇవి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రధానంగా పాపాయపాలెం, అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం గ్రామాల పరిధిలో వంద సంఖ్యలో అనుమతి లేని లేఅవుట్‌లు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీ కార్యాదర్శులు అక్రమ లేఅవుట్లకు, అక్రమ భవన నిర్మాణాలకు ధర నిర్ణయించి వసూలు చేసుకుంటున్నారని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సముద్ర తీరం వద్ద అక్రమ లేఅవుట్‌లకు గరిష్ఠంగా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు, ఎటువంటి అనుమతులు లేకుండా రిసార్ట్‌ల నిర్మాణానికి రూ.2 లక్షలు, విద్యుత్ మీటర్ మంజూరుకు ఇచ్చే అనుమతి ఎన్వోసీకి రూ.5 నుండి రూ.10 వేలు ధర నిర్ణయించినట్లు సమాచారం. ప్లాన్ ఇవ్వకుండా భవనాలు నిర్మించుకుంటున్న వారి వద్ద భవనం నిర్మాణాన్ని బట్టి రూ.20 వేలు ధర నిర్ణయించారు. కొత్త భవనాలకు ఆస్తి పన్నులు విధింపునకు ధర నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు సమాచారం. అవినీతిపరులైన కొందరు మండల, డివిజనల్ పంచాయతీ అధికారులు కార్యదర్శులు ప్రతి నెలా ఇచ్చే ముడుపులకు కక్కుర్తిపడి పట్టించుకోవడం లేదు.



చల్లారెడ్డిపాలెంలో లేఅవుట్ లేకుండా పొలంలో నిర్మించిన భవనం



విద్యుత్ మీటరు మంజూరు చేసి విద్యుత్ స్తంభానికి బిగించిన దృశ్యం

కొత్తపేట కార్యదర్శి ప్రత్యేకం

కొత్తపేట పంచాయతీ చీరాల మున్సిపాలిటీలో కలసి ఉంటుంది. కానీ పంచాయతీగానే కొనసాగుతుంది. సంపన్నులు ఎక్కువగా ఈ పంచాయతీ పరిధిలోనే ఉంటుంటారు. ఈ పంచాయతీ కార్యదర్శి దాదాపు నాలుగేళ్లగా ఇక్కడే కొనసాగుతున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేటపాలెం మండలం పరిధిలోని అందరు కార్యదర్శులను బదిలీ చేశారు. కానీ కొత్తపేట కార్యదర్శి మాత్రం బదిలీ కాలేదు. రాజకీయ నాయకులకు రూ.20 లక్షలు వరకు ముడుపులు ఇచ్చి బదిలీ ఆపుకున్నట్లు బహిరంగ గానే చర్చ జరిగింది. మండల పరిధిలోని ఏ కార్యదర్శిపైనా రాని విధంగా ఇతనిపై అవినీతి ఆరోపణలు వచ్చినట్లు ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

నోటు కొట్టు. ఎన్వోసీ పట్టు

చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో కొత్తగా భవనం, రేకుల షెడ్డు, వ్యాపార సంస్థ, బంకు ఏర్పాటు చేసుకున్నా సరే దానికి విద్యుత్ మీటరు కోసం కార్యదర్శి, ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుంది. కార్యదర్శి చేయి తడిపితే చాలు ఎలాంటి నిబంధనలు లేకుండానే ఎన్‌ఓసీ జారీ చేస్తున్నారు. పోరంబోకు, డ్రెయినేజీ పోరంబోకు భూములు, పంట పొలాల్లో కట్టడాలు కట్టుకున్నా సరే డబ్బులు తీసుకుని ఎన్‌ఓసీ జారీ చేస్తున్నారు. అక్రమ లేవుట్, రోడ్డు మార్జిన్, పంట పొలాల్లో ఎక్కడైనా ఇల్లు నిర్మించుకుని విద్యుత్ మీటరు కావాలంటే ఎన్‌ఓసీ కావాలి. కార్యదర్శికి రూ.2 వేలు నుంచి రూ.5 ఇస్తే చాలు ఎన్‌ఓసీ ఇచ్చేస్తారు.

విచారణ చేస్తాం

ఆరోపణలు వచ్చిన కార్యదర్శులపై విచారణ చేస్తాం. ఆరోపణలు నిరూపణ అయితే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ, వేటపాలెం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

పరిశ్రమల స్థాపనకు అన్ని వనరులు సమకూర్చాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పరిశ్రమల స్థాపనకు అన్ని వనరులు, అనుమతులు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహక జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలతో ఉత్పాదకత, ఉపాధి అవకాశాలు, ఆదాయ వనరులు పెరుగుతాయని చెప్పారు. పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. అవసరమైన వనరులు సమకూర్చడం, అనుమతులకు సహకరించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పలు సూచనలు చేశారు. పరిశ్రమల స్థాపనకు ఇటీవల సింగిల్ డెస్క్ విధానంలో 189 దరఖాస్తులురాగా, అందులో 171 అనుమతులు పొందాయన్నారు. పీఎం ఈజీపీ పథకం కింద 56 యూనిట్లు స్థాపించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రూ.1.53 కోట్ల నిధులతో యూనిట్ల స్థాపన లక్ష్యం కాగా 65 యూనిట్లను ఇప్పటికే ప్రారంభించినట్లు చెప్పారు. పీఎం విశ్వకర్మ పథకానికి జిల్లా నుంచి 38,446 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి అందులో 4,765 దరఖాస్తులను కేంద్రానికి పంపామన్నారు. 2,916 దరఖాస్తులకు అనుమతులు లభించాయన్నారు. సమావేశంలో డీఆర్వో జి గంగాధర్‌గౌడ్, కమిటీ కన్వీనర్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకృష్ణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఫ్యాప్సీ కార్యదర్శి భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు భూసేకరణ చేపట్టాలి

జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టా లని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, పరిశ్రమలకు భూసేకరణ, ఇసుక రవాణా, స్వచ్ఛ ఆంధ్ర, పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాల కోసం చీరాల, రేపల్లె డివిజన్లలో భూసేకరణ చేపట్టాలన్నారు. రుతు పవనాలు రాకముందు ప్రజలకు ఇసుక కొరత లేకుండా ముందస్తుగా లక్ష టన్నుల ఇసుకను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నుండి ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు, నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం గాజులంక –1 ఇసుక రీచ్ నుండి ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. గాజులంక –2 ఇసుక రీచ్ త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలో తాగునీటి ఇబ్బందులు లేకుండా కృష్ణా పశ్చిమ కాలువల ద్వారా ట్యాంకులకు నీరు నింపుకోవాలని ఆదేశించారు. బాపట్ల పట్టణానికి తాగునీరు అందించే రక్షిత నీటి పథకానికి కృష్ణ పశ్చిమ కాలువ ద్వారా నీటిని నింపుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీలో మూడుసార్లు ఫిర్యాదులు వచ్చిన సిబ్బందిని పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని అధికారులకు చెప్పారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, జిల్లా సరఫరాల శాఖ అధికారి విలియమ్స్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు పి.గ్లోరియా, చంద్రశేఖర నాయుడు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ మంత్రి

- నాడు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై వివాదం
- నేడు శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణంపై రచ్చ



శ్మశానవాటిక ప్రహరీ పనులను దగ్గరుండి చేయిస్తున్న మాజీ మంత్రి పాలేటి రామారావు

చీరాల: ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మాజీ మంత్రి పాలేటి రామారావుల మధ్య విభేదాలు రోజురోజుకు ముదురుతున్నాయి. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు గ్రూపులుగా చీలిపోయారు. ఎమ్మెల్యే గ్రూపు నేరుగా ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటుండగా పాలేటి గ్రూపు మాత్రం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేరుతో పనులు చక్కబెట్టుకుంటున్నారు. వీరి మధ్య వివాదానికి గతంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కారణమైంది. దీంతో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు వ్యవహారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరగాలని ఆయన తరపున పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పట్టుబట్టారు.

ఈ వ్యవహారం తన ఆధ్వర్యంలో జరగాలని పాలేటి భీష్మించుకుని కూర్చొన్నారు. ఈ వ్యవహారం సద్దుమణిగింది. మరో రాజకీయ వ్యవహారం బయటపడింది. చీరాల గొల్లపాలెం శ్మశానవాటిక ప్రహరీ వ్యవహారం ఇద్దరి మధ్య రాజకీయ చిచ్చుకు దారితీసింది. మూడు రోజుల కిందట ఎమ్మెల్యే కొండయ్య అధికారికంగా ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయాల్సి ఉంది. శ్మశాన స్థలంలో కొంత తమది ఉందంటూ కొందరు ముందుకు రావడంతో ఈ విషయంపై ఇరువురితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పి శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరుకాలేదు. దీంతో మాజీ మంత్రి పాలేటి రామారావు ఎన్నో ఏళ్ల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం జరగకుండా ఉందని చెప్పి స్థానికులతో చర్చించి ఆయన అక్కడే కూర్చొని ప్రహరీ నిర్మాణం జరిపించారు. ఎమ్మెల్యే వాయిదా వేసిన విషయాన్ని పాలేటి నిర్మాణ పనులు దగ్గరుండి చేయించడంపై చీరాలలో రాజకీయ చర్చలకు తెరలేపింది. ముందు ముందు ఇరువురి మధ్య పలు కీలక అంశాలు రాజకీయ దుమారం, విభేదాలు జరుగుతాయని టీడీపీ శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నారు.

మాతా, శిశు మరణాలు లేకుండా విధులు నిర్వర్తించండి



మాట్లాడుతున్న జిల్లా డీఎం అండ్ హెచ్‌వో విజయమ్మ

డీఎం అండ్ హెచ్‌వో ఎస్.విజయమ్మ

చీరాల టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్య సిబ్బంది విధులు సమర్థంగా నిర్వర్తించి గ్రామాల్లో మాతా, శిశు మరణాలు లేకుండా చూడాలని బాపట్ల డీఎం అండ్ హెచ్‌వో ఎస్.విజయమ్మ సూచించారు. గురువారం పట్టణంలోని డోలా ఐజాక్ ఎన్జీవో భవనంలో చీరాల డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తేన్న ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఈవోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికి వైద్యం సకాలంలో సక్రమంగా అందించే బాధ్యత సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లపై ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని మారుమూల ప్రాంతాలు, శివారు కాలనీల్లో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరికి వైద్య సేవలందించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా ఏఎన్ఎంలు, హెచ్ఈవోలు, ఆశ కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఎక్కడా కూడా మాతా, శిశు మరణాలు లేకుండా చూడాలని, విధుల్లో అశ్రద్ధ వహించినా సకాలంలో వైద్య సేవలందించకపోయినా చర్యలు తప్పవన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు, వ్యాక్సిన్లు సకాలంలో వేయాలన్నారు. అలానే వేసవిలో వడదెబ్బలు తగలకుండా ప్రజలకు సూచనలు అందించడంతో పాటుగా అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏఎన్ఎం, ఎంపీహెచ్‌వోలు విధులు సమర్థంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో పర్చూరు, వెదుళ్లపల్లి, కారంచేడు, చినగంజాం, ఈపురుపాలెం పీహెచ్‌సీలోని ఏఎన్ఎం, ఎంపీహెచ్‌వోలతోపాటుగా, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యాకోబ్, సీహెచ్‌వో మల్లికార్జునరావు, కోటేశ్వరరావు, బాపట్ల 108 ఇన్‌చార్జి డాక్టర్ బ్రహ్మం, సబ్ యూనిట్ అధికారి సీహెచ్ శేషుబాబు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కలపై ధరల పిడుగు

ఆకాశంలో భవన నిర్మాణ సామగ్రి ధరలు

- వారం వ్యవధిలో బస్తాకు రూ.50 పెరిగిన సిమెంట్ ధర
- ఐరన్ టన్నుకు రూ.6 వేలు పెరుగుదల
- 30 శాతం పెరిగిన ఇంటి నిర్మాణ వ్యయం
- అర్ధంతంగా నిలిచిన నిర్మాణాలు



నిర్మాణం మధ్యలో నిలిచిన ఇల్లు

వేటపాలెం: పైసాపైసా కూడబెట్టి సొంతిల్లు నిర్మించుకోవాలనుకునే పేద, మధ్య తరగతి ప్రజల కల నెరవేరేలా లేదు. ప్రస్తుతం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోవడమే అందుకు కారణం. వారం కిందట సిమెంట్ బస్తా రూ.270 ఉండగా ప్రస్తుతం రూ.320కి చేరింది. అలాగే ఐరన్, ఇటుకలు, ఇసుక, కంకర ధరలు గతేడాది కంటే 30 శాతం పైగా పెరిగాయి. దీనికి తోడు కూలీలు, తాపీమేస్త్రీల కూలి ధరలు భారీగా పెరిగాయి.

ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం తలకు మించిన భారంగా మారింది. దీంతో ఇంటి నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. గృహ నిర్మాణాలు చేసి పేదల సొంతింటి కలను నిజం చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ధరల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

నిలిచిన ప్రభుత్వ పక్కా ఇళ్ల పథకం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పక్కా ఇళ్ల పథకం నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. బాపట్ల జిల్లాలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 31,167 వేల పక్కా ఇళ్లు మంజూరు చేశారు. వాటిల్లో ఎన్నికల ముందు నాటికి 11 వేలు నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించారు. ఇంకా 20 వేలు ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా నిలిచిపోయిన పక్కా ఇళ్ల బిల్లులు కూటమి ప్రభుతం నిలిపి వేసింది. ప్రస్తుతం పెరిగిన భవన నిర్మాణ మెటీరియల్ ధరలు లబ్ధిదారుకు మరింత భారం కానుంది.

వ్యాపారం కష్టంగా ఉంది

మేము చాలా కాలంగా సిమెంట్, స్టీల్ షాపు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం సిమెంట్ బస్తాకు రూ.50 పెరిగింది. స్టీల్ ధర టన్నుకు రూ.6 వేలు పెరిగింది. ప్రస్తుతం ధరలు పెరగడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. వ్యాపారాలు పెద్దగా లేవు. గతంలో లాగా వ్యాపారాలు జరగడం లేదు.

– నారాయణ, వ్యాపారి, చీరాల

గతంలో ఇప్పుడు ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు వ్యత్యాసాలు


సామగ్రి పేరు	గతంలో	ప్రస్తుతం
సిమెంట్ బస్తా	రూ.270	రూ.320
స్టీల్ కిలో	రూ. 57	రూ.65
ఇటుకలు ఒకటి	రూ.7	రూ. 11
ఇసుక ట్రాక్టర్	రూ.2 వేలు	రూ.4 వేలు
బెల్దారీ కూలి	రూ.600	రూ.850
మేస్త్రి కూలి	రూ.800	రూ.900
చదరపు అడుగు నిర్మాణ ఖర్చు	రూ.2500	రూ.3500






కృష్ణా నదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి

సురక్షితంగా బయటపడ్డ మరో ముగ్గురు





మృతి చెందిన గౌతం , దేవదాసు

రేపల్లె రూరల్: పెనుమూడి వద్ద కృష్ణా నదిలో మునిగి ఇరువురు యువకులు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... భట్టిపోలు మండలం వేమవరం గ్రామానికి చెందిన 30 మంది గ్రామస్తులు ఆటోలో రేపల్లె మండలం పెనుమూడి వద్ద కృష్ణా నదికి చేరుకున్నారు. బాప్టిజం కోసం ముగ్గురు రాగా వారి వెంట కుటుంబ సభ్యులు తరలివచ్చారు. వారిలో సరదాగా ఈత వేసేందుకు ఐదుగురు నదిలో దిగి నీట మునగగా గమనించిన స్థానికులు ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. మిగిలిన ఇద్దరిని నదిలో గాలించి కొంతసేపటికి ఒడ్డుకు తరలించారు. కొన ఊపిరితో ఉన్న ఇరువురు యువకులను అంబులెన్స్‌లో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మార్గంలో ఒక యువకుడు మృతి చెందగా చికిత్స పొందుతూ మరో యువకుడు మృతి చెందాడు. గుంటూరులో ఇంటర్ పూర్తి చేసిన తలకాయల గౌతం (18), పొన్నూరులో పాలిటెక్నిక్ పూర్తి చేసిన పెనుమాల దేవదాసు (19)లు మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ మల్లికార్జునరావు, తహసీల్దార్ శ్రీనివాసరావులు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్

గుంటూరుఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాకి డ్రిల్‌కు రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసుల డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్ని ప్రమాదాలను నివారించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రాణాలను రక్షించే విధానాలను అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై కరపత్రాలను మాదిరెడ్డి ప్రతాప్ విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన డీజీ ప్రతాప్ వారితో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, అగ్నిమాపక శాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కందిరీగల దాడిలో 15 మందికి గాయాలు

బాపట్ల:బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డులో గాయత్రీ అపార్టుమెంటు సమీపంలో కందిరీగలు దాడిలో 15 మందికి గాయాలయ్యాయి. మధ్యాహ్నం సమయంలో కందిరీగలు ఒక్కసారిగా పైకిలేచి ఆ ప్రాంతంలో వెళ్లే వారిపై దాడి చేశాయి. దాడిలో 15 మందికి గాయాలు కాగా వీరు ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలో చోటు

బాపట్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో బాపట్ల జిల్లాకు చెందిన పలువురికి అవకాశం కల్పిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి, జాయింట్ కార్యదర్శులుగా మాచవరపు రవికుమార్, షేక్ ఫర్‌వీజ్, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శిగా ఇమానియేల్ రీభాలను ఎంపిక చేశారు. వీరు ఎంపికైన పలువురు అభినందనలు తెలిపారు.

తప్పిన ప్రమాదం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టిన మినీ లారీ



చీరాల: జాతీయ రహదారిపై పెనుప్రమాదం తప్పింది. గురువారం చిన్నగంజాం నుంచి చెరుకుపల్లి మండలం పొన్నపల్లికి కుటుంబంతో కలసి ఆటోలో వెళుతుండగా చీరాలలోని జాతీయ రహదారిలో టీడీపీ కార్యాలయం వద్ద నీరు తాగేందుకు ఆటో నిలిపారు. అదే మార్గంలో వేరుశనగ లోడుతో వస్తున్న మినీ లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో వేగంగా పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో అందరూ ప్రాణాలతో బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



బాపట్ల టౌన్: ఇటీవల బాపట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ప్రైవేటు టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన రిటైర్డు రైల్వే ఉద్యోగి తులబందుల లక్ష్మీ నారాయణ(65) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. లక్ష్మీనారాయణ, నల్లమోతు మాధవి గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. నల్లమోతు మాధవి బుధవారం మృతి చెందగా లక్ష్మీనారాయణ గురువారం మృతి చెందారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వీరిరువురు జీవితాలు విషాదం కావటంతో వారి బంధువుల్లో విషాదం నెలకొంది.

గిన్నిస్‌బుక్‌లో స్థానం పొందడం అభినందనీయం



పాఠశాలలో కీబోర్డుతో పాటలుపాడుతున్న వివేక్



అభినందన సభలో మాట్లాడుతున్న హెచ్‌యం

బల్లికురవ: విద్యార్థి వివేక్ కృషి పట్టుదలతో కీబోర్డుపై పాటలు పాడుతూ ప్రపంచ రికార్డుతోపాటు గిన్నీస్‌బుక్‌లో స్థానం పొందటంతో మండలానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చాడని ఎంఈవో–2 ఎ.రమేష్‌బాబు కొనియాడారు. వల్లాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలో 7వ తరగతి చదువుతున్న మందా వివేక్ హలేల్ మ్యూజిక్ స్కూల్ తరుపున క్రిస్టియన్ సంగీత పోటీల్లో పాల్గొని గిన్నీస్‌తో ప్రపంచ రికార్డు సాధించిన విషయం విదితమే. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షత అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో ఎంఈవో మాట్లాడుతూ వివేక్ తండ్రి రమేష్ కీ బోర్డుప్లేయర్ కావటం వల్ల వారసత్వంతోపాటు ప్రోత్సాహంతో క్రిస్టియన్ గీతాలు పాడుతూ గతేడాది డిసెంబర్ 1న జరిగిన ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొన్నాడన్నారు. 18 దేశాల నుంచి 1046 మంది గంట వ్యవధిలో వీడియోలు అప్‌లోడ్ చేశాడని అందులో వివేక్ ఉండటం గర్వించదగ్గ విషయం అన్నారు. సంగీతంతో రాబోయే కాలంలో వివేక్ మరెన్నో పతకాలు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు మందా సుబ్బారావు, గొంద్రు చిన్న, చింతల రామారావు అన్నారు.

కార్మిక సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య

అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలైనా కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని రాష్ట్ర ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య అన్నారు. గురువారం స్థానిక రూపేష్ భవనంలో ఎస్‌కె కరిముల్లా అధ్యక్షత ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కాలరాస్తున్నారన్నారు. అధికారం రాకముందు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరిద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారం వచ్చిన తరువాత పట్టించుకోవటం లేదన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం మే 20వ తేదిన సార్వత్రిక సమ్మెను దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 25న అన్ని యూనియన్‌లతో సన్నాహక సదస్సును విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, రాష్ట్ర అంగన్‌వాడీ ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యేలు, నియోజకవర్గ కార్యదర్శులు ఎస్ శ్రీనివాసులు, డీ.నాగేశ్వరరావు, కెఎల్‌డీ ప్రసాద్, ముస్తాఫా, అంగన్‌వాడీ జిల్లా కన్వీనర్ ఎస్ వాణిశ్రీ, జిల్లా పాఠశాల ఆయా సంఘం కన్వీనర్ సుజాత, కోటేశ్వరరావు, రమణయ్య, మరియబాబు, బాపిసైదయ్య, సీహెచ్ ప్రకాష్, ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు ప్రారంభం



శ్రీకృష్ణ తులాభారం నాటకంలో ఓ సన్నివేశం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై ఏపీ ప్రభుత్వ సృజనాత్మకత, సంస్కృతీ సమితి, భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ టీవీ, కళాంజలి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు మొదలయ్యాయి. ఆలయ పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి పుట్ట గుంట ప్రభాకరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఏపీ నాటక అకాడమీ నిర్వాహకులు గుమ్మడి గోపాలకృష్ణ, హంస అవార్డు గ్రహీత కావూరి సత్యనారాయణ, ఉగాది పురస్కారగ్రహీత నల్లక శ్రీనివాసరావు, టీవీ. నటుడు, నిర్మాత డాక్టర్ వలేటి అప్పారావు ప్రసంగించారు. ఈనెల 19 వరకు స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు జరుగుతాయని కళారత్న డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం శ్రీదుర్గాభవాని నాట్యమండలి (తెనాలి) ఆధ్వర్యంలో ఆరాధ్యుల ఆదినారాయణరావు నిర్వహణలో శ్రీకృష్ణ తులాభారం, పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. నటీనటులు వారి పాత్రల్లో పౌరాణి పద్యాలతో నాటక అభిమానులను మెప్పించారు. డోలక్‌పై సాంబిరెడ్డి చక్కటి సహకారాన్ని అందించారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు 896 బస్తాలు రాగా మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు కనిష్ట ధర రూ.11,161, గరిష్ట ధర రూ.12,275, మోడల్ ధర రూ.11,851 పలికినట్లు వివరించారు. కాయలు కనిష్ట ధర రూ.10,800, గరిష్ట ధర రూ.12,311, మోడల్ ధర రూ.11,851 పలికినట్లు వెల్లడించారు.

రైతుల దుస్థితిని కళ్లకు కట్టిన 'అన్నదాత'



అన్నదాత నాటికలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి రామలింగేశ్వరపేటలోని ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో భాగంగా ఆరో రోజైన గురువారం రెండు నాటికలను ప్రదర్శించారు. తొలుత కళాంజలి, హైదరాబాద్ వారి అన్నదాత నాటికను ప్రదర్శించారు. నేటి సమాజంలో రైతుల పరిస్థితిని కళ్లకు కట్టిందీ నాటిక. అప్పుల్లో కూరుకుపోతున్న రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్న వర్తమాన స్థితిని ఎత్తిచూపింది. రైతాంగం మనుగడ ప్రశ్నార్థకం కావటం వ్యవసాయాధారిత దేశంలో ఓ గొప్ప విషాదంగా వర్ణించిందీ నాటిక. వల్లూరు శివప్రసాద్ రచించిన ఈ నాటికను కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించారు. వివిధ పాత్రల్లో శోభారాణి, సురభి ప్రియాంక, భుజంగరావు, పున్నయ్యచౌదరి, రాధాకృష్ణ, తిరుమల, శివరాం, ప్రశాంత్ నటించారు.

వినోదాన్ని పంచిన 'వర్క్ ఫ్రమ్ హోమ్'..

అనంతరం సహృదయ, ద్రోణాదుల వారి 'వర్క్ ఫ్రమ్ హోమ్' నాటికను ప్రదర్శించారు. నలభీముడిలా వంటల చేయగల దిట్ట అయిన సుధీర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తూ వర్క్ ఫ్రమ్ హోమ్‌లో అటు వృత్తిపని, ఇంట్లోకి తరచూ వచ్చే చుట్టాలకు వంటలు చేస్తూ సతమతమైన వ్యవహారాన్ని ఆద్యంతం హాస్య సన్నివేశాలకు వినోదాత్మకంగా సాగిందీ నాటిక. చివరకు ఉద్యోగానికి రిజైన్ చూసి 'సౌమ్యలక్ష్మీ హోమ్ ఫుడ్స్' పేరుతో స్టార్టప్‌ను ప్రారంభిస్తాడు. కేకే భాగ్యశ్రీ మూలకథను అద్దేపల్లి భరత్‌కుమార్ నాటకీకరించగా, డి.మహేంద్ర దర్శకత్వం వహించి, ప్రధాన పాత్రలో నటించారు. ఇతర పాత్రల్లో కొత్త శివరాంప్రసాద్, ఆళ్ల హరిబాబు, షేక్ షఫీ ఉజ్మా, వి.నాగేశ్వరరావు, లహరి నటించారు. తొలుత యనమదల రీతిక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతుల అభినందనలు అందుకుంది. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో జరుగుతున్న ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకటకోటేశ్వరరావు పర్యవేక్షించారు.

గోవుల మృతిపై విచారణ చేపట్టాలి

చినకాకాని(మంగళగిరి): తిరుపతిలో గోవుల మృత్యువాతపై ప్రభుత్వం విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాల్సిందిపోయి మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ మంటలు సృష్టిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. చినకాకానిలో జరుగుతున్న జనసేవాదళ్ శిక్షణ తరగతులకు హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ తిరుపతిలో లడ్డూ కల్తీ అయిందని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అర్థం పర్థం లేని వ్యాఖ్యలతో మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలో ప్రధానిగా ఉన్న మోదీ 11 ఏళ్లలో హిందువులకు ఏం చేశారని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చాక రూపాయి విలువ పడిపోయిందని విమర్శించారు. ప్రధాని అదానీ, అంబానీలకు దోచి పెట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలపై దాడులు, లైంగిక దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, గని, ఆరేటి రామరావు, కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

చీరాలలో డ్రోన్‌లతో నిఘా



చీరాల: చీరాల పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని ప్రధాన ప్రాంతాలలో డ్రోన్‌ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకునే దిశగా నిఘాను మరింత కఠినతరం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సహకారం ద్వారా చీరాలలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ నాగభూషణం, పోలీసు సిబ్బంది ఈ ప్రత్యేక నిఘా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇసుక లారీ బీభత్సం

- ఆర్టీసీ బస్సును ఢీకొట్టి షాపుల్లోకి దూసుకెళ్లిన వైనం
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ఇసుక లారీ ఢీకొట్టడంతో వెనుక భాగం దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ఇసుక లారీ ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కనున్న షాపుల్లోకి దూసుకుపోయిన ఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో గురువారం జరిగింది. తెనాలి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు గుంటూరుకు బయలుదేరి వేజండ్ల అడ్డరోడ్డు వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవటం కోసం నిలిచి ఉంది. అదే సమయంలో తెనాలి నుంచి నారా కోడూరు వైపు వేగంగా వస్తున్న టర్బో ఇసుక లారీ ఆర్టీసీ బస్సును వెనుకవైపు ఢీకొట్టింది. వెంటనే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, మెకానిక్ షాపులలోకి దూసుకువెళ్లింది. ప్రమాద సమయంలో షాపుల వద్ద ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. చేబ్రోలు పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని ఇసుక లారీని, ఆర్టీసీ బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీరాల కేంద్రంగా గోవా మద్యం

550 బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు



ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసిన స్వాధీనం చేసుకున్న గోవా మద్యం

చీరాల: చీరాల కేంద్రంగా గోవా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. రైళ్లలో గోవా నుంచి చీరాల వాడరేవు, తీర ప్రాంతాలకు తరలించి రిసార్టులకు విక్రయిస్తున్నారు. ఇది చాలా కాలంగా కొనసాగుతూనే ఉంది. గురువారం సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గోవా మద్యం నిల్వ ఉంచిన స్థావరాలపై దాడులు నిర్వహించారు. వాడరేవు వైఎస్సార్ కాలనీకి చెందిన ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.55 వేలు విలువ చేసే 550 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ విజయ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా నాన్ డ్యూటీ మద్యంను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలా తరచూ మద్యం తరలించిన వారిపై కఠినమైన చట్టాలను ఉపయోగిస్తామన్నారు. దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు సీఐ రామారావు, చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, ఎస్సైలు బి.శ్రీహరి, రమాదేవి, రాజేంద్రప్రసాద్, టూటౌన్ ఏఎస్సై టి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో నిలిచిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి



బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

చీరాల అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవిబాబు, పి.దయాబాబులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలానే ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈఓఎల్‌లు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 114 జీవోలో పొందుపరచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150 నుంచి రూ.400 వరకు చెల్లింపులు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డెలిగేట్ డి.ప్రవీణ్‌కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్థలం వివాదంలో నిందితులకు జరిమానా, జైలు

అద్దంకిరూరల్: స్థల వివాదంలో ఆరుగురు నిందితులకు ఎఎస్‌జే కోర్టు జడ్జి జరిమానా, శిక్ష విధించినట్లు సీఐ సుబ్బరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. అద్దంకి మండలం మైలవరం గ్రామంలో 2020లో జరిగిన స్థల వివాదంలో అప్పటి ఎస్సై వీ.మహేష్ మన్నేపల్లి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు రిజిస్టర్ చేసి కోర్టులో ఫైల్ చేశారు. విచారణలో భాగంగా నిందితులైన ఉడుములపల్లి సోమయ్య, కొండనాగరాజు, కుడుములపల్లి పెదకోటయ్య, కుడుములపల్లి శ్రీనివాసరావు, కుడుములపల్లి కోటయ్య, కొండా చిరంజీవిలపై కేసు నిరూపణ కాగా గురువారం అద్దంకి ఎఎస్‌జే కోర్టు జడ్జి డీ. నాగ వెంకటలక్ష్మి ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు.

యువకుడి మృతిపై అనుమానం

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు వినతిపత్రం

తాడేపల్లి రూరల్: పల్నాడు జిల్లా నడికుడిలో రైలు కింద పడి మృతి చెందిన నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం, క్రిష్టపాడు గ్రామానికి చెందిన గడ్డం ప్రవీణ్‌కుమార్(28)ది ఆత్మహత్య కాదని, ఏదో కుట్రకోణం దాగి ఉందని జాతీయ మానవ హక్కుల సంఘం వైస్ చైర్మన్ బి.వి.ఎస్.కృష్ణారెడ్డి, మృతుడి తల్లి సుగణమ్మ గురువారం మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరులో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు, విజయవాడ రైల్వే ఎస్పీ విజయ్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ విజయవాడలోని వెన్ సాయి పీవీసీ గ్రానైట్స్ కంపెనీలో మేనేజర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేస్తున్నాడని, 2025 మార్చి 12న కార్యాలయం నుంచి వెళ్లిన ప్రవీణ్ మార్చి 13న పల్నాడు జిల్లా నడికుడి రైల్వేస్టేషన్ పరిధిలోని తుమ్మలచెరువు ట్రాక్‌పై మృతదేహమై కనిపించాడని, మృతుడికి ఆత్మహత్య చేసుకోవాల్సిన సమస్యలు లేవని పేర్కొన్నారు. ప్రవీణ్ ఉద్యోగం చేసే ప్రాంతం, మృతి చెందిన ప్రాంతానికి సుమారు 138 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. తోటి కంపెనీ ఉద్యోగులను విచారణ చేస్తే అసలు విషయం బయటకు వస్తుందని, నడికుడి రైల్వే ఎస్ఐ విచారణ వేగవంతం చేయడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దీనిపై పూర్తి విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశామని తెలిపారు.

కుమార్తె పెళ్లికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు
- వధువు అన్నకు కూడా..
- చేబ్రోలులో అదుపుతప్పిన కారు





ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్న కారు



క్షతగాత్రులు

చేబ్రోలు: కుమార్తె పెళ్లికి వెళ్లి వస్తుండగా కారు ప్రమదవశాత్తూ బ్రిడ్జి సైడ్‌వాల్‌ను వేగంగా ఢీ కొట్టడంతో తల్లిదండ్రులతోపాటు వధువు అన్నకు గాయాలైన ఘటన చేబ్రోలులో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..పొన్నూరు రూరల్ మండలం కట్టింపూడి గ్రామానికి చెందిన రోహా, రాధిక దంపతులు తమ కుమార్తెను తాడికొండకు చెందిన అబ్బాయికి ఇచ్చి వివాహం చేశారు. వివాహం అనంతరం భార్యభర్తలు, తమ కుమారుడు నవీన్ కుమార్‌రెడ్డితో కలిసి తాడికొండ నుంచి కారులో స్వగ్రామానికి గురువారం బయలుదేరారు. నవీన్‌కుమార్‌రెడ్డి కారు నడుపుతున్నాడు. చేబ్రోలులోని సినిమాహాలు సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వంతెన సైడ్ వాల్‌ను వేగంగా ఢీకొట్టింది. ఘటనలో కారు ముందు బాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న ముగ్గురికీ ముఖానికి, కాళ్లు, చేతులు, నడుంకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనం ద్వారా క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా టు ఆంధ్రా గంజాయి రవాణా

- తాడేపల్లి పోలీసులకు పట్టుబడిన నలుగురు యువకులు
- నిందితుల్లో అంతర్జాతీయ స్విమ్మర్!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ



పోలీసులు పట్టుకున్న గంజాయి

తాడేపల్లి రూరల్ : ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు గంజాయి సరఫరా అవుతోందని రుజువైంది. తాజాగా గురువారం తాడేపల్లి పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ కేసు వివరాలను నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ వద్ద కొందరు గంజాయి తాగుతున్నారన్న సమాచారం రావడంతో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఇతర సిబ్బంది నిఘా ఏర్పాటుచేసి గంజాయి తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నాలుగు కేజీల గంజాయి లభ్యమైంది. పాత ఇఎస్ఐ హాస్పిటల్ వద్ద వార్పునకు చెందిన పీతా దినేష్ కుమార్, పోలకంపాడుకు చెందిన కోడె సూర్యగణేష్, ఉండవల్లికి చెందిన మల్లిశెట్టి అనీల్, పెనుమాకకు కళ్ళం అనీల్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారు. వీరు ఒడిశాలోని బరంపురంలో గంజాయి కొని అక్కడి నుంచి రైలు ద్వారా తాడేపల్లికి తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నట్టు నిర్ధారణైంది. ఈ నలుగురిలో పీతా దినేష్‌కుమార్‌పై కృష్ణాజిల్లాలో ఓ గంజాయి కేసు నమోదై ఉంది. మిగిలిన ముగ్గురు తొలిసారి పట్టుబడ్డారు. వీరు డబ్బులు అవసరమైనప్పుడు ద్విచక్రవాహనాలు తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో ఒడిశా వెళ్లి గంజాయి కొని తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్ముతుంటారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

గంజాయికి అలవాటు పడిన అంతర్జాతీయ స్విమ్మర్

నిందితుల్లో మల్లిశెట్టి అనీల్ అంతర్జాతీయ స్విమ్మర్ అని, అతనూ గంజాయికి అలవాటు పడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వ్యాయామాలపై అవగాహన కలిగిన క్రీడాకారులూ వ్యసనాలకు అలవాటు పడడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ కేసులో ప్రతిభకనబర్చిన తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారని డీఎస్పీ వెల్లడించారు.